క్లుప్తంగా

సాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేయాలి

నంద్యాల (సెంట్రల్): రాయలసీమ సాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు స్వతంత్ర సంస్థతో సమీక్ష నిర్వహించి ప్రణాళికలు రూపొందించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి కోరారు. స్థానిక సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అంశంపై ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. సీమ అభివృద్ధికి కీలకమైన నీటి పారుదల రంగంపై సీఎం జగన్ గతంలో అధికారులతో చర్చలు జరిపి ప్రాధాన్యతల్ని ప్రకటించారని గుర్తుచేశారు. సాగునీటి దుస్థితిపై సీఎంకు నివేదిక పంపామని చెప్పారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు



కామినేనిపల్లెలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: మండలంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కామినేనిపల్లెలో ఎస్సీ కాలనీ, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రూ.10 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం కింద, పీఎంఏజీవై కింద సిమెంట్ రోడ్లు నిర్మాణాలు పూర్తియయ్యాయి. అలాగే రూ.4.20 లక్షల ఉపాధి పథకం నిధులతో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్ర నిర్మాణం పూర్తియింది. ఏకగ్రీవ పంచాయతీ నిధులతో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేశారు.

రైతులపై భారం మోపొద్దు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం రైతులపై విద్యుత్ మీటర్ల పేరుతో భారం మోపడం సరికాదని, విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 30వ తేదీన స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ పట్టణకార్యదర్శి ప్రసాద్, సోమన్న తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బలవంతంగా రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేయడం బాధాకరమన్నారు.

ఏపీపీ ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న మల్లికార్జున, రంగ హేమంత్‌కుమార్ నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఏపీపీ ఈసెట్ (ఆంధ్ర ప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రెన్స్ టెస్ట్)లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ శశికళ బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మల్లికార్జున 810, అలాగే హేమంత్‌కుమార్ 700 ర్యాంకులు రావడం శుభపరిణామమన్నారు.

ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీగా నాగఅనసూయ

దొర్నిపాడు: ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీగా నాగఅనసూయ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ప్రస్తుతం గోస్పాడు ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల దొర్నిపాడు నుంచి బదిలీపై వెళ్లిన ఆమెను మళ్లీ ఇక్కడికి ఇన్‌చార్జ్‌గా నియమించారు.

గ్రంథాలయం తనిఖీ

శిరివెళ్ల: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాశ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పుస్తకాల నిర్వహణ, సందర్శకుల, పాఠకుల రిజిష్టర్లను పరిశీలించారు. బకాయి పడిన రూ.1.20లక్షల గ్రంథాలయ పనున్న వారం లోపు వసూలు చేయాలని లైబ్రేరియన్ సుజాతను ఆదేశించారు.

పండ్ల తోటల సాగులో నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు రైతులను గుర్తించే విషయంలో నిర్లక్ష్యం తగదని ఏపీడీ సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ క్లస్టర్ పరిధిలో వెయ్యి ఎకరాలు సాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతివ్వగా ఇప్పటి వరకు 600 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసే సన్న, చిన్న కారు రైతులను గుర్తించామన్నారు. అవకాశం గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాగు నీటి వసతి కలిగి వున్న ప్రదేశాలను గుర్తించి ఎకరాకు ప్రభుత్వం రూ. 90 వేల నుంచి రూ. 1.10లక్షల వరకు నిర్వహణ కోసం అందిస్తుందని చెప్పారు. జూలైలో పండ్ల మొక్కలు నాటిస్తామని ఏపీఓ రవిప్రకాశ్ తెలిపారు.

టైర్ పేలి కారు బోల్తా

చాగలమర్రి: మండలంలోని పెద్ద బోధనం గ్రామ సమీపంలోని 40వ నంబరు జాతీయ రహదారిపై కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద బుధవారం మధ్యాహ్నం టీఎస్ 08 హెచ్‌పి 5790 నంబరు గల టైరు పేలి కారు బోల్తా పడింది. స్థానికులు తెలపిన మేరకు వివరాలు.. రాజంపేటకు చెందిన మస్తాన్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాదుకు వెళ్లి తిరిగి రాజంపేటకు వెళ్తుండగా పెద్దబోధనం గ్రామ సమీపంలో కారు ముందు భాగం లోనున్న టైరు పేలి బోల్తా పడింది. మస్తాన్‌కు స్వల్ప గాయాలు కాగా మిగిలిన వారందరూ సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చాగలమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

స్త్రీనిధి.. ప్రగతికి పెన్నిధి

- ఒక్క పొదుపు గ్రూపునకు రూ.7లక్షలు రుణం
- పైసా ఖర్చు లేకుండా మంజూరు
- గత ప్రభుత్వంలో రూ.లక్ష మాత్రమే
- 2023–24లో ప్రభుత్వ లక్ష్యం రూ.147 కోట్లు
- ఇప్పటికే రూ.40 కోట్లు మంజూరు
- మహిళల అభ్యున్నతే లక్ష్యంగా సర్కారు చర్యలు



సమావేశమైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అందజేస్తుంది. వీటి ద్వారా వారు జీవనోపాధులు కల్పించుకొని ఆదాయం పెంచుకుంటే కుటుంబం వృద్ధిలోకి వస్తుందని ఆర్థికంగా చేయూతనిస్తుంది. ముఖ్యంగా పొదుపు సంఘాల్లోని సభ్యులైన మహిళలకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తుంది. టీడీపీ హయాంలో ఒక గ్రూపునకు కేవలం రూ.లక్ష మాత్రమే రుణం ఇచ్చేవారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.7లక్షలు అందజేస్తుంది. దీంతో తమ జీవనోపాధులను మెరుగు పరుచుకొని వేగంగా వృద్ధిలోకి వచ్చేందుకు తోడ్పడుతుందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతా ల్లోని పేద మహిళలను స్త్రీనిధి రుణాలు అత్యవసర సమయాల్లో ఆదుకుంటున్నాయి. కొందరు పిల్లల చదువులకు, వివాహాలకు, మరికొందరి జీవనోపాధికి వినియోగించుకుంటున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో 33,516 స్వయం సంఘాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో సుమారు 3,35,488 మందికి పైగా రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. టీడీపీ హయాంలో స్త్రీనిధి రుణాలు నలుగురి నుంచి ఐదుగురు సభ్యులకు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం కలిపి రూ.లక్ష మంజూరు చేసే వారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. ఒక్కో మహిళకు రూ.లక్ష వరకు తీసుకునే వెసులుబాటు కల్పించింది. గ్రూపులో ఏడుగురు సభ్యులకు రూ.7లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. అంతేగాక లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా అధికారులు కార్యక్రమాలు చేపడుతున్నారు.

నేడు ఇలా..

మహిళల జీవనోపాధులు పెరిగేలా ప్రస్తుతం అతి తక్కువ శాతం వడ్డీపై స్త్రీనిధి రుణాలను సకాలంలో మంజూరు చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా బ్యాంకుల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటి నుంచే రుణాలు పొందే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇందు కోసం ఎవరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు కూడా లేదు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.147 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే రూ.40 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. రుణం తీసుకున్న మహిళ మరణిస్తే భారం ఇతర సభ్యులపై పడకుండా ఆమె చెల్లించాల్సిన మొత్తాన్ని మాఫీ చేస్తున్నారు. స్వయం సహాయక గ్రూపు మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నారు. రుణాలు తీసుకొని చెల్లించే వడ్డీతో స్త్రీనిధి సంస్థకు లాభాలు వస్తున్నాయి. వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని గ్రామ సంఘాలు (వీఓఏ) మండల సమాఖ్యలకు కేటాయిస్తున్నారు.

సంవత్సరాల వారీగా మంజూరు చేసిన స్త్రీనిధి రుణాలు..

సంవత్సరం	అందజేసిన రుణం (రూ.కోట్లలో)
2020-21	110.43
2021-22	119.91
2022-23	150.71
2023-24	40

ఆపద కాలంలో చేదోడు



చైతన్య గ్రూపులోని సభ్యుల తీర్మానంతో రూ.లక్ష రుణం తీసుకున్నా. ఈ రుణం ఆడపిల్లల చదువులు చదివేందుకు ఎంతో ఉపయోగపడింది. అలాగే పొదుపు కారణంగా కుటుంబ పోషణ సులభమైంది. అలాగే ప్రభుత్వం అందజేస్తున్న రుణాల కారణంగా కొంత మేర అభివృద్ధి చెందాం. మాలాంటి పేదలకు రుణాలిచ్చి ఎంతో అభ్యృద్ధి చెందేందుకు అండగా నిలవడం సంతోషకరం.

– రాజకుమారి, పొదుపు మహిళ, నంద్యాల

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మహిళల జీవనోపాధుల అభివృద్ధి కోసం ప్రభుత్వం స్త్రీ నిధి రుణాలు ఇస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 3,35,448 మంది సభ్యులకు సభ్యులకు రూ.147 కోట్ల రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటికే రూ.40 కోట్లకు పైగా రుణాలు అందజేశాం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి.

–శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

క్రికెట్ టోర్నీ ప్రారంభం



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్యామలా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో డాక్టర్ సంజీవ్ శ్యామల ప్రీమియర్ లీగ్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శ్రీ రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో బుధవారం ప్రారంభించారు. డాక్టర్ సంజీవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరాముడు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు. అదనపు ఎస్పీ వెంకటరాముడు మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆలోచనలు పక్క దా రి పట్టకుండా ఉంటాయని, శారీరక దారుఢ్యం మెరుగవుతుందన్నారు. విజేతలకు ట్రోఫీలతో పాటు వరుసగా రూ.లక్ష, రూ.50వేలు, రూ.25వేలు, అందజేస్తా మని నిర్వాహకులు తెలిపారు.పోటీల్లో 80జట్లు పాల్గొంటాయని,నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాబుల్లా, నూర్‌ఖాన్, నాదిమ్, రెహమాన్, అశోక్‌శ్రీకాంత్, అక్బర్, దాసు, హుసేన్, మాలి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గోస్పాడు: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఏపీ దళిత సమాఖ్య నాయకులు మద్దిలేటి, నాగలక్ష్మమ్మ అన్నారు. సివిల్ రైట్స్ డే ఈనెల 30న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోస్పాడులో ఎస్‌ఐ మల్లికార్జున, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్‌కు వినతి పత్రాలు అందజేశారు.

యువ న్యాయవాదులకు చేదోడుగా 'లా నేస్తం'



సీఎంకు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): కొత్తగా న్యాయవాద వృత్తిని చేపట్టిన యువ న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ లా నేస్తం పథకం చేదోడు నిలుస్తుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి, రామసుబ్బయ్య, ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో యువ న్యాయవాదులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకొనేంత వరకు జూనియర్ న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జూనియర్ న్యాయవాది అంబేడ్కర్ మాట్లాడుతూ యువ న్యాయవాదులు ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని లా నేస్తం పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రమేష్, వివేకానందరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, తిరుపతి, బాలహాజీ, తిమ్మారెడ్డి, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు అమ్మితే చర్యలు



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల (సెంట్రల్): వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని వ్యవసాయాధికారులు దుకాణాదారులకు సూచించారు. మంగళ, బుధ వారాల్లో జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో జీవనియంత్రణ ప్రయోగశాల ఏడీఏ సుధాకర్, జిల్లా వనరుల కేంద్రం ఏఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నంద్యాల ఏఓ ప్రసాద్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించారు. స్థానిక జనార్దన్‌రెడ్డి సీడ్స్, శ్రీవెంకటేశ్వర సీడ్స్, వినాయక సీడ్స్‌లో నిల్వ సూచిక, బిల్లు పుస్తకాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొన్న ఉత్పత్తులకు కచ్చితంగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. మూల, ఫౌండేషన్ విత్తన రిజిస్టర్‌లు తప్పక నిర్వహించాలన్నారు. శ్రీవెంకటేశ్వర సీడ్స్‌లో రికార్డులు సక్రమంగా నిర్వహించనందుకు రూ.21,72,220 విలువజేసే 892.10 క్వింటాళ్ల వరి విత్తనాల అమ్మకాల్ని నిలిపి వేశారు. విస్తరణాధికారి మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తించాలి



తుడుమలదిన్నెలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ జనార్దనరావు

ఉయ్యాలవాడ : జగనన్న సురక్ష కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసి అర్హులకు పథకాలు వర్తింపజేయాలని డీఎల్‌డీఓ జనార్దనరావు అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో డీఎల్‌డీఓ, టాస్క్‌ఫోర్స్ ప్రతినిధి రవికుమార్‌రెడ్డి గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల జాబితాను, గృహాల వద్ద వలంటీర్లు చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఉచితంగా చేపట్టిన 11 రకాల ధ్రువ పత్రాలను అందేలా చూడవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు అధికారుల బృందం జూలై 1 నుంచి చేపట్టనున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి



డబ్ల్యూ.గోవిందిన్నెలో నిర్మించిన సీసీ రోడ్డు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో రూ.70 లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు కోసం గ్రామస్తులు గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది. అయితే సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవ చూపి నిధులు విడుదల చేయించారు. దీంతో 278 మీటర్ల మేర ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు వేయించారు. సెంటర్ నుంచి పెద్దమ్మ గుడి దారిలో కలుగొట్ల వైపు, చాకరాజవేముల, డబ్ల్యూ కొత్తపల్లె వైపు రోడ్డు వేశారు. దీంతో పెద్దమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తొలగాయి.

విరాళాల సేకరణ

నంద్యాల(న్యూటౌన్): పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని చేపట్టిన 'పోరుకేక మహాపాదయాత్ర'కు సంఘీభావంగా పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కార్యదర్శి పుల్లా నరసింహ అధ్యక్షతన బుధవారం విరాళాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ జూలై 4వ తేదీ వరకు 15రోజుల పాటు 400కి.మీ మేర పాదయాత్ర చేపడతామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. 9 సంవత్సరాలు గడిచినా కేంద్ర ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోవడం లేదన్నారు. లక్ష్మణ్, వెంకటలింగం, నిరంజన్, దేవరాజు, బాలు పాల్గొన్నారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆకతాయికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి బుధవారం జైలు శిక్ష ఖరారు చేశారు. వివరాలు.. టెక్కె ప్రాంతానికి చెందిన లక్కబోయిన శ్రీనివాసులు ఈనెల 21న టెక్కె ప్రాంతంలో సాయంత్రం దారిన పోయే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా నిందితుడికి 15 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

జగనన్న సురక్ష ఆవశ్యకతను వివరించండి

నంద్యాల(సిటీ): మున్సిపల్ పరిధిలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. బుధవారం 21వ వార్డు నూనెపల్లె హరిజనవాడ, 5వ వార్డు నడిగడ్డ సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు పొందలేని వారిని త్వరగా గుర్తించాలని చెప్పారు. ప్రతి గహాన్ని సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ, మెప్మా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యాన్ని అధిగమించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయా లని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన బుధవారం మండల అధికారలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: అనారోగ్యంతో రామకృష్ణ(27) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం పట్టణంలోని దేవనగర్ వీధిలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. రామకృష్ణ, రమాదేవి భార్యా భర్తలు, వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా రామకృష్ణ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన రామకృష్ణ, భార్య కూలీ పనికి వెళ్లిన సయమంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చి గమనించిన భార్య త్రీ టూన్ పోలీసులకు సమాచారమిచ్చింది. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి



సాయిబాబానగర్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గా, మసీదు కమిటీ సభ్యులు బుధవారం ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని భీమవరం రస్తాలోని ఆల్‌పుర్‌ఖానా ఈద్గా, ఎస్‌ఆర్‌బీసీ ఈద్గా, శాంతిరాం మెడికల్ కళాశాల వద్దనున్న సున్ని మసీద్ ఈద్గా, బొమ్మలసత్రం ఈద్గా, సాయిబాబానగర్‌లోని ఈద్గా, నూనెపల్లె ఈద్గాల్లో ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా ఏర్పాట్లపై మున్సిపల్, విద్యుత్, పోలీస్, ఫైర్ శాఖల అధికారులు పలు సూచనలు చేశారు. దాదాపు 25వేల మంది నమాజుకు హాజరవుతారని, వీరందరికి వజూ చేయడానికి తాగునీరు, శామియానాలు, కార్పెట్లు, ప్రత్యేక సున్నపు లైన్లను వేయించారు.పండుగ రోజు ప్రార్థనలు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రవక్త బోధనలు, సందేశాలు, ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాకులు తెలిపారు. అలాగే.. మసీద్, ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశించారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

నంద్యాల(అర్బన్)/(వ్యవసాయం): దేశ ప్రధానిగా పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణల పితామహుడిగా చరిత్రకెక్కారని రామకృష్ణ ఎయిడెడ్ పాఠశాలల అధినేత నివర్తి మోహన్‌కుమార్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతిని నిర్వహించారు. నాయకులు చింతలమోహన్‌రావు, చింతలయ్య, ఊకొట్టు వాసు పాల్గొన్నారు. నందిరైతు సమాఖ్య కార్యాలయంలో విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్, జ్ఞాన ప్రసూన దంపతులు, పట్టణ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు, అన్నెం శ్రీనివాసరెడ్డి, నీలకంఠమాచారి, రఫీ, చంద్రశేఖర్, మనోహర్, మల్లికా, శ్రీలక్ష్మి, సాయికృష్ణ, మణికంఠ పాల్గొన్నారు.

రెడ్డి కమ్యూనిటీ కన్వీనర్ ఎంపిక

నంద్యాల(అర్బన్): రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్‌గా జయభారత్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జయభారత్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. నంద్యాలలోజరిగిన కార్యక్రమంలో జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి జాతి సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక ఆలయంలోని జగజ్జననీ మాతకు బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో సారె సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బిల్లులు త్వరగా మంజూరు చేయండి

చాగలమర్రి: జగనన్న గృహనిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మించుకొంటున్న లబ్ధిదారుల పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులను త్వరగా మంజూరు చేయాలని హౌసింగ్ డీఈ నాగరాజు ఎంపీడీఓ మహబూబ్‌దౌలాను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ ఇంజినీరింగ్, ఉపాధి హామీ సహాయకులు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ఇవ్వవలసిన ఉపాధి బిల్లులు ఒక్కొక్కరికి రూ.23 వేలు త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణాలు జులై 15 నాటికి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఈ షఫీవుల్లా, ఏపీఓ నిర్మల ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

నంద్యాలటౌన్: నంద్యాల సర్వజన ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌గా కె.అరుణ కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీపై పంపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్ ఆమెను అభినందించారు. కోశాధికారి నాగేశ్వరరావు, డీఎఫ్ఓ రాజు నాయక్ తదితరలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట మజరా అయిన చెంచుగూడేంలో సుమారు ఎనిమిదేళ్ల పాటు విధులు నిర్వహిస్తూ, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటు పడి బదిలీపై ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును విద్యార్థులు, హెచ్‌ఎం ప్రసాద్, తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. జాకీర్, పీఎంసీ చైర్మన్ మురళీ ఉన్నారు.

వేగంగా రోడ్ల నిర్మాణ పనులు



చిన్నకంబలూరు వద్ద రోడ్డు వేస్తున్న దృశ్యం



చిన్నకంబలూరు గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్డు



డబుల్ రోడ్డుగా మారిన సీఎం రోడ్డు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు సమీపంలో సీఎం (చాగలమర్రి–మహదేవపురం) రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. చాగలమర్రి నుంచి రుద్రవరం మీదుగా మహదేవపురం వరకు దాదాపు 55 కి.మీ. ఉంది. ఆ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలు ఎదురు పడినప్పుడు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. పలుమార్లు కొన్ని వాహనాలు బోల్తా పడిన ఘటనలు అనేకం. అలాగే ఏళ్ల క్రితం వేసిన రోడ్డు కావడంతో శిథిలమైంది. గుంతలమయమైన రహదారిలో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం దాదాపు రూ.55 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. సింగిల్ రోడ్డును విస్తరించి డబుల్ రోడ్డుగా మార్చారు. ఇందులో భాగంగా చిన్నకంబలూరు సమీపంలో తారు రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. అలాగే గ్రామంలో ఇదివరకే ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా విస్తరించి కొత్తగా సీసీ రోడ్డు వేస్తున్నారు. రోడ్డు పనులు పూర్తయితే వాహనదారులకు రోడ్డు సమస్య తీరినట్లే.

హాయిగా సాగుదాం





నాడు- దొర్నిపాడు వద్ద గుంతలమయమైన ఆళ్లగడ్డ-కోవెలకుంట్ల రోడ్డును కొత్తగా డబుల్ రోడ్డుగా మార్చిన దృశ్యం

దొర్నిపాడు: వద్దు రా బాబు.. ఈ దారిలో వాహనాల్లో వెళ్లడం కంటే నడిచి వెళ్లడమే నయం అనేట్లుగా ఆళ్లగడ్డ–కోవెలకుంట్ల రోడ్డు శిథిలమైంది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణానికి ప్రయాణికులు వెనుకంజ వేసేవారు. అడుగుకు ఓ గుంత, గజానికో గొయ్యితో ఉండే రహదారిని వైఎస్సార్ సీసీ ప్రభుత్వం వచ్చాకా రూ. 2కోట్లతో సీసీరోడ్డు, రూ.4 కోట్లతో బీటీ రోడ్డును వేశారు. దీంతో ప్రస్తుతం ఈ దారిలో ప్రయాణికులు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో సింగిల్ రోడ్డు ఉండగా ప్రస్తుతం డబుల్ రోడ్డు వేయడంతో వాహనాల రయ్..రయ్..మంటూ దూసుకుపోతున్నాయి.